# బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



తిమ్మాపూర్ రూరల్: రేణికుంటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- ఇంటింటా ఎన్నికల ప్రచారంలో గులాబీ పార్టీ శ్రేణులు

తిమ్మాపూర్, నవంబర్ 23: బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమైతదని.. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని రామకృష్ణకాలనీలో నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాలను ఎంతగానో అభివృద్ధి చేసిన ప్రభుత్వంవైపే ప్రజలు ఉండాలని కోరారు. కొందరు మాటల వరకే పరిమితమని.. వారివైపు ఉంటే అభివృద్ధి కుంటుపడుతుందని స్పష్టం చేశారు. నాయకులు గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, గుజ్జుల తిరుపతి రెడ్డి, సిరికొండ వెంకట్‌రావు, గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, కిన్నెర అజయ్, తోటపల్లి గణేశ్, దాడి ఓదెలు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

**రేణికుంటలో..**

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 23: మండలంలోని రేణికుంట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎంతో కష్టపడి తన ఉద్యోగాన్ని పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్నారని, అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి పరిచారని వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఎస్సీఎస్టీ అట్రాసిటీ జిల్లా సభ్యుడు ఎలుక ఆంజనేయులు, కరీంనగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఎలుక అనిత, ఉపసర్పంచ్ కుంభం శ్రీనివాస్, ల్యాగల దేవేందర్‌రెడ్డి, బాపురెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మెట్‌పల్లిలో..**

శంకరపట్నం, నవంబర్ 23: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డాక్టర్ రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, తదితర నాయకులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మెట్‌పల్లి తదితర గ్రామాల్లో మహిపాల్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్‌ను తిరిగి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలు ప్రజలకు ఎంతగానో మేలు చేశాయని తెలిపారు. రసమయి బాలకిషన్ తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆయనను గెలిపించి గ్రామాలను మరింత అభివృద్ధి పరచుకుందామని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ నాయకుడు వంగల కిషన్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లు

## బీఆర్ఎస్‌లో చేరిక

మానకొండూర్, నవంబర్ 23: రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ సమక్షంలో గురువారం మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన సంఘం ఉపాధ్యక్షుడు సింగసాని మహేశ్, డైరెక్టర్లు నరేడ్ల శంకర్, నరేడ్ల లక్ష్మణ్, రాజయ్య, రాజేశం, స్వామి తదితరులకు హోంమంత్రి కండువాకప్పి స్వాగతించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ దేవ సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హోమ్ ఓటింగ్‌ను పరిశీలించిన డీఈవో



శంకరపట్నం: ఎరడపల్లి గ్రామంలో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

శంకరపట్నం/ మానకొండూర్ రూరల్, నవంబర్ 23: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలో 80 సంవత్సరాలపై బడిన మిరాల కొమురయ్య ఇంటి వద్ద, శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామంలో నాగుల తిరుపతి ఇంటి వద్ద హోమ్ ఓటింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఇంట్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ అనుపమకు పలు సూచనలు చేశారు. మండలంలో మొత్తం 108 హోం ఓటింగ్ ఓట్లు ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇక్కడ ప్రిసైడింగ్ అధికారి, అబ్జర్వర్, వీడియోగ్రాఫర్, బీఎల్‌వో, కారోబార్ ఉన్నారు.

# రేవంత్‌రెడ్డి ఖబడ్దార్

- స్థాయిని మరచి మాట్లాడితే ఊరుకోం
- ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లింది ఎవరో ప్రజలందరికీ తెలుసు
- పీవీ జిల్లా పేరుతో ఇక్కడి ప్రజలను మోసగించలేరు
- పీవీ శతజయంతి వేడుకలు నిర్వహించింది కేసీఆరేనని మరువద్దు
- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 23: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి మాట్లాడితే ఊరుకునేది లేదని, ఉద్యమ నాయకుడైన కేసీఆర్‌పై నోరు జారితే ఖబడ్దార్ అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం హుజూరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. జమ్మికుంటలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభ జనం లేక వెలవెలబోవడంతో ఏమీ పాలు పోక రేవంత్‌రెడ్డి ఉద్యమ నాయకుడైన కేసీఆర్‌ను తన ఇష్టం వచ్చినట్లు విమర్శించే పని పెట్టుకున్నాడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే హుజూరాబాద్‌ను జిల్లా చేస్తామని కల్లబొల్లి మాటలతో ఇక్కడి ప్రజలను మోసం చేయలేరన్నారు. మాజీ ప్రధాని పీవీ మృతి చెందితే ఆయన అంత్యక్రియలు సైతం సరిగ్గా నిర్వహించకపోగా, కనీస గౌరవం ఇవ్వని కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఇప్పుడు ఆయనపై కపట ప్రేమ నటించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. పీవీకి నిజంగా తగిన గుర్తింపునిచ్చింది, పీవీ శత జయంతి వేడుకలు ఏడాది పొడవునా దేశంలోనే నిర్వహించింది ఒక్క తెలంగాణలోని సీఎం కేసీఆర్ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. ఓటుకు నోటు దొంగ కేసులో జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి, టీపీసీసీ పదవిని డబ్బులు పెట్టి కొని తెచ్చుకున్న విషయం అందరికీ తెలుసన్నారు. ఎంతో కొంత చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ రేవంత్‌రెడ్డి వచ్చాక పూర్తిగా దిగజార్చారని, ఇటీవల పార్టీలో చేరిన వారికి క్షణాల్లో ఎమ్మెల్యే టికెట్లను కేటాయించడం, టికెట్లు అమ్ముకున్నారంటూ ఆ పార్టీ నాయకులు ఆందోళనలు చేయడమే ఇందుకు నిదర్శనం అన్నారు. డబ్బులు, భూములు తీసుకుని ఎమ్మెల్యే సీట్లు అమ్ముకున్న రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ పదవి ఇవ్వడమే చేసిన మొదటి తప్పని శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీని పట్టుకుని ఏళ్ల తరబడి పనిచేసిన నాయకులను కాదని క్షణాల్లో చేరిన వారికి డబ్బులు తీసుకొని సీట్లు ఇచ్చి పాత వారికి మొండి చేయి చూపిన విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. పైసలకు టిక్కెట్లు అమ్ముకున్న రేవంత్ రేపు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముకోడని గ్యారంటీ ఏమిటన్నారు. కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డిని నమ్మి ఆ పార్టీ బాధ్యతలు అప్పగించి పెద్ద తప్పు చేశారని ఆ పార్టీలోని నాయకులే బహిరంగంగా ఆరోపిస్తున్నారన్నారు. గత హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కావాలని బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌తో కుమ్మక్కై డమ్మీ కాంగ్రెస్ అభ్యర్థిని పెట్టి అమ్ముడుపోయిన వ్యక్తి రేవంత్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. డబ్బుకు అమ్ముడుపోయే రేవంత్‌రెడ్డి ప్రగతి ప్రధాత అయిన కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా పాలన అందించిన ఘనత ఒక్క సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వర్దినేని రవీందర్‌రావు, యూత్ పట్టణ శాఖ అధ్యక్షుడు గండె సాయిచరణ్, మైనార్టీ నాయకుడు ఎస్‌కే ఫయాజ్, నాయకులు సంపంగి రాజేందర్, భూమ్ రామకృష్ణముదిరాజ్, కందుల స్వామిపటేల్ తదితరులు పాల్గొన్నారు.

## 'వాగేశ్వరి'లో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు




మాట్లాడుతున్న చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీ క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రన్

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 23: మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజ్ క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రన్.. విద్యార్థినీ విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ ఫార్మా రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఫార్మసిస్టులు సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో వాగేశ్వరి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి డాక్టర్ డీ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 23: అక్రమంగా మద్యం తరలిస్తున్న తాళ్లపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తిమ్మాపూర్ సర్కిల్ ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, తాళ్లపల్లి శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై 95 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. దీంతో బైక్‌ను సీజ్ చేసి తాళ్లపల్లి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు శ్రీకాంత్, సరిత, హెడ్ కానిస్టేబుల్ రాజేశం, సిబ్బంది పాల్గొన్నారు.